క్లుప్తంగా

కూచిపూడి పోటీల్లో నివేదిత ప్రతిభ



తొర్రూరు: జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థిని బానోతు నివేదిత ఉత్తమ ప్రతిభ కనబర్చింది. తాజాగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జాన్సన్ పబ్లికేషన్ నిర్వహించిన జాతీయ కూచిపూడి నృత్య పోటీల్లో పాఠశాల విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి విద్యార్థిని సత్కరించి, అభినందించారు

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు



గార్ల: డీసీసీ అధ్యక్ష పదవి కోసం గార్లకు చెందిన టీపీసీసీ సభ్యుడు ఎడ్ల శ్రీరామ్ యాదవ్ గురువారం బయ్యారంలో జరిగిన పార్టీ సభలో ఏఐసీసీ పరిశీలకుడు దేవశిష్ పట్నాయక్‌కు దరఖాస్తును సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



తొర్రూరు: అనారోగ్యంతో పట్టణ వాసి శీలం రామదాస్ ఇటీవల మృతి చెందగా 1989–90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. గురువారం డివిజన్ కేంద్రంలోని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.16వేలు, క్వింటాల్ బియ్యం అందించారు. కార్యక్రమంలో స్థానికులు కుర్ర శ్రీనివాస్, ఎస్. నాగవాణి, అలువాల సోమయ్య, మారిపల్లి రాజు, బోగ జితేందర్, దివిటి రాజు, ఆశయ్య, వెంకటాచారి, శ్రీనులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను జయప్రదం చేయండి

గార్ల: గార్లలో 17, 18 తేదీలలో నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల జోనల్ స్థాయి క్రీడా పోటీలను జయప్రదం చేయాలని జోనల్ క్రీడల సెక్రటరీ గూగులోత్ శ్రీను కోరారు. గురువారం గార్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, మాలోత్ శివ, పీడీలు జ్యోతి, పద్మ, పీఈటీలు హరినాయక్, శంకర్, శేఖర్, బుచ్చి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తొర్రూరు: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన శివార్ల ఎల్లమ్మ ఇంటికి బంధువులు రాగా వారికి సపర్యలు చేసి బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి వారిని రైలు ఎక్కించింది. అదే రోజు రాత్రి 10గంటలకు ఇంటికి రాగా తాళాలు, తలుపులు, బీరువాలు పగలగొట్టి ఇల్లు అంతా చిందరవందరగా ఉండటాన్ని గమనించింది. 4తులాల 8గ్రాముల బంగారం, 130తులాల వెండి, రూ.10వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి



గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో గొర్లకొట్టంపై గురువారం వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో 7గొర్రె పిల్లలు మృతిచెందగా, 2గొర్రె పిల్లలు గాయపడ్డాయి. గొర్రెల కాపరి మాలోతు లాల్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్లమందను కొట్టంలో భద్రత ఏర్పాట్లు చేసి గేటు పెట్టి వెళ్లారు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా గొట్టంలోని గొర్రె పిల్లలపై దాడికి పాల్పడడంతో అక్కడికక్కడే 7మృతిచెందాయి. రెండు గాయపడ్డాయి. వీటి విలువ సుమారు రూ.50వేలకు పైగా ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

మక్కకు మద్దతు ధరేది?

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం
- క్వింటా రూ.1600 నుంచి రూ.2వేల వరకు కొనుగోలు
- వేలాది రూపాయలు నష్టపోతున్న రైతులు



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్నలు

బయ్యారం: ఆరుగాలం కష్టపడి అనేక ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర అందకపోవటంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రతి ఏటా పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్న పాలకులు ఆచరణలో అవి అమలు అయ్యేలా చూడకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. జిల్లాలో ఈ వానాకాలంలో 47,340 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయగా ప్రస్తుతం కోతదశకు చేరుకుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.2400 మద్దతు ధర ప్రకటించగా ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1600 నుంచి రూ.2000 వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే ప్రైవేట్ వ్యాపారులు నిర్ణయించిన ధరకు పంటను విక్రయించి రైతు మోసపోవాల్సి వస్తుంది.

ఏజెన్సీలో మక్కలే ప్రధానపంట..

జిల్లాలో బయ్యారం, గార్ల, కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలతో పాటు మహబూబాబాద్ మండలంలోని కొన్ని గ్రామాలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఈగ్రామాల్లో ప్రధానంగా నీటి వసతులు లేకపోవటంతో వర్షాధారంగా వేలాది ఎకరాల్లో వానాకాలంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తుంటారు. వానదేవుడిపై భారంతో సాగు చేసిన పంటలు సరైన వర్షాలు కురిస్తే పండుతాయి లేకపోతే ఎండిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఒక్కో ఎకరానికి 20 నుంచి 25వేల రూపాయల పెట్టుబడులు పెట్టి రైతులు పంటను సాగు చేస్తుంటారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర అందుతుంది. మరో వైపు ప్రైవేట్ వ్యాపారులు సైతం మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టానుసారంగా ధరలు పెడుతున్నారు. ఇలా ధరలు పెట్టడం వల్ల మాకు మద్దతు ధర అందక నష్టపోతున్నం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– సుధాకర్, రైతు, కట్టుగూడెం

మార్కెట్‌లో దళారుల ఇష్టారాజ్యం

నెహ్రూసెంటర్: ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల పంటలను మార్కెట్‌లో విక్రయించేందుకు వస్తే మార్కెట్‌లో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూనెం ప్రభాకర్, ఆవుల కట్టయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ఈ నెల 17, 18, 23వ తేదీలలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ముల్కురి జగ్గన్న, ఈశభిక్షం, రంగయ్య, ఎల్లయ్య, పాపయ్య పాల్గొన్నారు.

ట్రస్మా నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు: ట్రస్మా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర నాయకులు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని వికాస్ హైస్కూల్‌లో నూతన కమిటీ ఎన్నిక చేపట్టారు. మండల అధ్యక్షుడిగా వేముల రమేష్, ప్రధాన కార్యదర్శిగా రుద్రోజు రవిశంకర్‌లను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని వారు తెలిపారు.

మీడియాపై దాడులు సిగ్గుచేటు



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు

తొర్రూరు: ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే మీడియాపై ఏపీ ప్రభుత్వ దాడులు సిగ్గుచేటు అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, ఐజేయూ జాతీయ కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ అన్నారు. సాక్షి మీడియాపై ఏపీ ప్రభుత్వ దాడులను నిరసిస్తూ గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవన సమీప జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబూని ఏపీ సీఎం చంద్రబాబు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈసందర్భంగా సంతోష్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, సాక్షి మీడియాపై ఏపీ పోలీసులతో సోదాలు, దాడులు చేయించడం అప్రజాస్వామికమన్నారు. ప్రజా ప్రయోజనాలపై పోరాడుతున్న సాక్షి మీడియా గొంతు నొక్కడానికి చంద్రబాబునాయుడు యత్నించడం దారుణమన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ప్రతిపక్షాలు, ప్రసార మాధ్యమాలు గొంతుకను వినిపించే హక్కులేకుండా చూడటం నియంత పాలనేనని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ముద్దసాని వెంకటేశ్వర్లు, కొత్తూరు రమేష్, కొండా వెంకన్న, కొదునూరి సదాకర్, అంజన్న, అనపురం వెంకన్న, జర్నలిస్టులు మేరుగు రమేష్, జిలుకర రాజు, చీకటి వీరన్న, వేర్పుల మహేష్, రామకృష్ణ, కార్తీక్, సైదులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



దంతాలపల్లి: సీపీఆర్‌ను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

దంతాలపల్లి: సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళ్ల ముందు మనిషి కుప్పకూలి పోయినప్పుడు అతనిని కాపాడడానికి ఉపయోగపడే ప్రాణవాయువే సీపీఆర్ అన్నారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలలో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సీపీఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర రావు, వైద్యాధికారి కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడేందుకు 'సీపీఆర్'

నెహ్రూసెంటర్: సీపీఆర్ పద్ధతి ద్వారా గుండె తిరిగి పని చేసే విధంగా ఉపయోగపడి ప్రాణాలను కాపాడవచ్చని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లీలా, టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. సీపీఆర్ విధానంపై జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన పెంచుకునేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆగిపోయిన గుండె పనితీరును సీపీఆర్ ద్వారా పని చేసేలా దోహదపడుతుందని పేర్కొన్నారు. అత్యవసర వేళల్లో సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మంజుల, శిరీష, శైలజ, రామరాజు, రాజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయానికి స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

పెద్దవంగర: గుండె ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని పల్లె దవాఖానా వైద్యుడు మహేష్ తెలిపారు. గురువారం మండలంలోని పడమటి తండాలో స్థానికులకు హృదయ–శ్వాస పునరుద్ధరణ(సీపీఆర్) చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

రిజర్వేషన్లు బీసీల హక్కు



తొర్రూరు: నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

తొర్రూరు: రిజర్వేషన్లు బీసీల హక్కు అని బీసీ రిజర్వేషన్ సాధన జేఏసీ నాయకులు ముద్దసాని వెంకటేశ్వర్లు, సముద్రాల సోమయ్య పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో గురువారం బీసీ జేఏసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని, స్టే ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని తెలిపారు. ఈనెల 18న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు చీకటి రమేష్‌గౌడ్, అల్లాబాబు, దొనికెన కుమారస్వామి, కొదునూరి సదాకర్, కొండ వెంకన్న, కోట వెంకటేశ్వర్లు, మిట్టకోల లక్ష్మణ్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: బీసీలకు 42 శాతం ఇవ్వాల్సిందేనని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ దంతాలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి చిర్రయాకన్న అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18న బంద్‌కు తమ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల యాకసాయిలు, ఉడుగుల పెద్ద లింగన్న, నక్క యాకన్న, గద్దల లింగన్న, సంపత్ పాల్గొన్నారు.

18న బంద్‌కు సంపూర్ణ మద్దతు

నెహ్రూసెంటర్: ఈనెల 18వ తేదీన బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జరగనున్న బంద్‌కు సీపీఐ మద్దతు తెలుపుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి గురువారం తెలిపారు. బంద్‌కు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సంపూర్ణ మద్దతిస్తుందని పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి

దంతాలపల్లి: మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు ఇండియా లిటరసీ ఆధ్వర్యంలో గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా కెరీర్ గైడ్ కోట కిశోర్‌బాబు పదో తరగతి తర్వాత వివిధ కోర్సులు, విద్యావకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎప్పటికి అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రిసోర్స్ అయిన చాట్‌బాట్ నంబర్ హెల్ప్ లైన్, నంబర్ వైబ్‌సైడ్ ఉపయోగించి కెరీర్‌పై మరింత అవగాహన పెంచుకోవడానికి ఈప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రోగ్రాం చేసినందుకు ప్రాజెక్ట్ వారిని అభినందించారు. కార్యక్రమంలో శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ సురేందర్‌గుప్తా, మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, పీడీ నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతోలులో ఘనంగా 'గ్యార్మీ షరీఫ్'



జెండాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరోవార్డు బేతోలు గ్రామంలో గ్యార్మీ షరీఫ్ (జెండా పండుగ) వేడుకలను ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో గ్యార్మీ జెండాలను చేతపట్టుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపు చేసి గ్రామ శివారులో ఉన్న మహబూబ్ సుభాని, ఖాదర్ బాబా దర్గాల వద్ద ప్రతిష్టించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు ఉర్సు ఉత్సవాలు, అన్నదానం..

హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఉన్న ఉర్సు గుట్టపై శుక్రవారం ముస్లింలు మహబూబ్ సుభాని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు (ఫాతిహా) యాటపోతు కందులు చేసి మొక్కులు చెల్లించి, ఉర్సు ఉత్సవాలు జరుపుకుంటారని నిర్వాహకులు తెలిపారు. అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఖందిల్ కమిటీ సభ్యులు యూసుఫ్, మస్తాన్, మొయినోద్దీన్, మహిబూబ్, జావిద్ (సదర్ సాబ్), మదార్, ఫకీర్, లతీఫ్, బాల్ సైద్, ఖాదర్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న రవీంద్ర

కేసముద్రం: మన ఊరు సర్కారు బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీంద్ర అన్నారు. గురువారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో గ్రామస్తులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్న ఊరిని, చదువుకున్న బడిని ఎన్నటికి మరిచిపోవద్దన్నారు. గ్రామ విద్యాభివృద్ధి కమిటీ ద్వారా కార్పస్ ఫండ్‌ని ఏర్పాటు చేసుకుని, 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతి కన్వీనర్, సభ్యుల ఆమోదంతో విరాళాల ద్వారా సేకరించిన డబ్బులను ఖర్చు చేయవచ్చన్నారు. అనంతరం ఇనుగుర్తి గ్రామవిద్యాభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దార్ల రామ్మూర్తి, జనరల్ సెక్రటరీగా హెచ్‌ఎం రూపారాణి, సలహాదారులుగా వద్దిరాజు దేవేందర్, గంజి శ్రీనివాస్‌రెడ్డి, గంజి కళావతి, గంజి జితేందర్ రెడ్డి, కోకన్వీనర్‌లుగా పీఎస్ హెచ్‌ఎం వీరన్న, రాజేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. తరగతుల కన్వీనర్‌లుగా పింగిలి శ్రీనివాస్, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, కుమార్, బాబురావు, యాకన్న, రవి, శోభారాణి, భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కేసముద్రం: గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగం సారయ్య(63) అనే వ్యక్తి ఆర్మీ ఉద్యోగం నుంచి పదవి విరమణ పొందాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడటంతో అతని ఆరోగ్యం క్షీణించి ఇంటి వద్దే ఉంటున్నాడు. మద్యం తాగితే ఆరోగ్యం దెబ్బతింటుందని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపంతో బుధవారం గడ్డిమందు తాగాడు. దీంతో అతన్ని 108లో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బీసీ రిజర్వేషన్లపై నిర్లక్ష్యం

నెల్లికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 42శాతం బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపెల్లి వీరన్న అన్నారు. మండలంలోని ఆలేరు గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బియ్యం లారీ బోల్తా..

బయ్యారం: పీడీఎస్ బియ్యం సరఫరా చేసే లారీ గూడూరు మండలంలో బియ్యం లోడు చేయగా అనంతారం గోడౌన్‌లో దించాల్సి ఉంది. గురువారం డ్రైవర్‌కు దారి తెలియక మండలంలోని నామాలపాడు వద్దకు తీసుకొచ్చి ఆ తర్వాత లారీని వెనుకకు తిప్పి అనంతారం తీసుకెళ్లే ప్రయత్నంలో జిన్నెలవర్రె వద్ద ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బన్సీకి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి

మహబూబాబాద్ రూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న దినసరి కార్మికులు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లభించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ పారా లీగల్ వలంటీర్లు కోరారు. సంస్థ పారా లీగల్ వలంటీర్లు మేకల శ్రీనివాస్, యుగంధర్ గురువారం కార్మికులకి బీమా సౌకర్యం గురించి వివరించారు.

వీధిలైట్లు లేక ప్రజల ఇబ్బందులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేసముద్రం విలేజ్, కేసముద్రంస్టేషన్, అమీనాపురం, ధన్నసరి, సబ్‌స్టేషన్‌తండా జీపీలలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని గురువారం ఎంసీపీఐ మండల కార్యదర్శి వార్డు ఆఫీసర్ అన్సారీకి వినతిపత్రాన్ని అందజేశారు.

వేగంగా రైల్వే మూడో లైన్ పనులు

డోర్నకల్: పాపటపల్లి, డోర్నకల్ రైల్వే బైపాస్ లైన్ల మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) ఏ.సంజీవరావుతోపాటు రైల్వేశాఖకు చెందిన పలువిభాగాల ఉన్నతాధికారులు లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలి

మరిపెడ రూరల్: పత్తికి కనీసం మద్దతు ధర రూ.10,075 ప్రకటించి సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. గురువారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బోడపట్ల రాజశేఖర్, బాణాల రాజన్న, దొంతు మమత, కందాల రమేష్, కొండ ఉప్పలయ్య పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మరిపెడ రూరల్: మండలంలోని ఎడ్జర్ల, తానంచర్ల, ఆనేపురం, ఎల్లంపేట గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పశువైద్యాధికారి సీహెచ్ మనోహన్ కృష్ణకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంపై నిద్రించిన గుర్తు తెలియని వృద్ధుడు(65) ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫారంపై నుంచి పట్టాలపై పడి గాయపడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ అమీర్‌ఖాన్ క్షతగాత్రుడిని 108వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపర్చినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్‌పై కత్తులతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, దాడి సీపీఎం పట్టణ కమిటీ ఖండిస్తుందని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఖాతాల్లో వేతనాలు జమ చేయాలి

నెహ్రూసెంటర్: ఐకేపీ వీఓఏలకు కనీస వేతనాలు అమలు చేసి వ్యక్తిగత ఖాతాల్లోనే వేతనాలు జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా మహాసభ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా నీలం కృష్ణవేణి, కార్యదర్శిగా చింత మౌనిక, కోశాధికారిగా హనుమంతు ఎన్నికయ్యారు.

కృషి చేస్తే విజయం సాధ్యం..

పెద్దవంగర: విద్యార్థులు కృషి చేస్తే విజయం సాధించవచ్చని చిట్యాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. లయన్స్‌క్లబ్ సేవా తరుణి తొర్రూరు ఆధ్వర్యంలో గురువారం చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్ ఇన్ వన్, ఎన్ఎంఎంఎస్ మెటీరియల్స్, స్టేషనరీ, ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సేవా తరుణి అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి, సెక్రటరీ పద్మావతి, లయన్ ఉమా పాల్గొన్నారు.

కలుషిత మాంసం సీజ్

డోర్నకల్: స్థానిక మాంసం మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కలుషిత మాంసాన్ని మున్సిపాలిటీ సిబ్బంది సీజ్ చేశారు. కలుషిత మాంసం విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ లోకేష్, రెవెన్యూ అధికారి నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ కల్యాణ్ మాంసం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, ఓ దుకాణంలో కలుషిత మాంసాన్ని గుర్తించి సీజ్ చేశారు. దుకాణదారుడికి రూ.1000 జరిమానా విధించారు.

జీఎంసీకి భౌతికకాయం అప్పగింత



నెహ్రూసెంటర్: కురవి మండలానికి చెందిన శతాధిక వృద్ధురాలి పెండెం బచ్చమ్మ మృతి చెందగా వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం లయన్స్ క్లబ్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గురువారం భౌతికకాయాన్ని అప్పగించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న, జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, పరికిపండ్ల అశోక్, సీహెచ్ శ్రీనివాస్, గుంటి సురేష్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలతోపాటు జయ్యారం, గుండంరాజుపల్లి పాఠశాలల్లో గురువారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్, వెంకట్రామనర్సయ్య, మహమ్మద్ ఉస్మాన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

తొర్రూరు: పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించిన పలువురిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు. ఎలాంటి ప్రొసీడింగ్ పత్రాలు లేని పలువురు బుధవారం డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించారని, అక్కడికి వచ్చిన తహసీల్దారు, రెవెన్యూ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఆక్రమణదారులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

గంగారం: గంగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన కేసులో నిందితుడు ఈసం హరికృష్ణ కోర్టు వాయిదాలకు తరుచుగా హాజరుకాకపోవడంతో మహబూబాబాద్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. గురువారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్ తరలించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

సంఘానికి వంట సామగ్రి వితరణ

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గండి సాయిమల్లు ఇటీవల మృతి చెందారు. తన తండ్రి సాయిమల్లు జ్ఞాపకార్థం అతని కుమార్తెలు గౌడ సంఘానికి రూ.10వేలు విలువ చేసే వంటసామాగ్రిని అందజేశారు. సేవా దృక్పథం కలిగిన వారి కుటుంబ సభ్యులను గౌడ సంఘం నాయకులు కొమిరెల్లి ఈ సందర్భగా కొనియాడారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



భరత్ (ఫైల్)

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంతో వెళ్తూ మోటార్ సైకిల్‌ను ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈసంఘటన మండలంలోని శ్రీరామగిరి గ్రామ శివారు పంతులు తండా స్టేజీ మహబూబాబాద్ నెల్లికుదురు ప్రధాన రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం దుబ్బతండాకు చెందిన ధారావత్ భరత్‌నాయక్ (25) హైదరాబాద్‌లో రాపిడోలో కారు నడుపుతున్నాడు. 10రోజుల క్రితం తన సొంత గ్రామం దుబ్బతండాలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. తన సొంత పనుల మీద మోటార్ సైకిల్‌పై మహబూబాబాద్‌కు వెళ్లి, తిరిగి వస్తున్న క్రమంలో మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన తుప్పతూరి వీరస్వామికి చెందిన ఇసుక ట్రాక్టర్ అతి వేగంతో వచ్చి భరత్‌నాయక్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. భరత్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.